సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం : 6 : డిసెంబర్ : 2023



బోనమో తల్లీ

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం సమర్పించారు. వర్షంలో చలవపందిళ్ల కింద తడుస్తూనే మొక్కులు చెల్లించుకున్నారు.



మిడ్‌మానేరులో 23 టీఎంసీలు

బోయినపల్లి: మిడ్‌మానేరు ప్రాజెక్టులో 23.42 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ఎలాంటి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో లేదని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
24.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను కలిసిన చల్మెడ



కేసీఆర్‌తో లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన చల్మెడ లక్ష్మీనర్సింహారావు మంగళవారం కేసీఆర్‌ను కలిశారు. ఎన్నికల ఫలితాలపై కాసేపు చర్చించినట్లు చల్మెడ తెలిపారు.

రేపు సిరిసిల్లకు కేటీఆర్ రాక



కె.తారకరామారావు

సిరిసిల్ల: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె.తారకరామారావు గురువారం సిరిసిల్లకు రానున్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత మొదటి సారి కేటీఆర్ ఇక్కడికి రానున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో తెలంగాణ భవన్‌లో సమావేశమవుతారని నాయకులు తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు, ఇతర నాయకులతో సమావేశం కానున్నారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

న్యాయ సహాయం గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవా సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ మాట్లాడారు. న్యాయ సేవా ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పెంట శ్రీనివాస్, గంత అంజయ్య, గుర్రం ఆంజనేయులు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

జనగామ జెడ్పీ చైర్మన్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న అరుణ, నాయకులు

సిరిసిల్ల: జనగామ జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి గుండెపోటుతో మరణించడంపై రాజన్న సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సంతాపం తెలిపారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో మంగళవారం సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అరుణ అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, కుంబాల మల్లారెడ్డి, అంజద్, శివ, మోసిన్, కృష్ణ, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై ప్రచారం చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

వేములవాడఅర్బన్: ఏరియా ఆసుపత్రిలో మహిళలకు ప్రతీ మంగళవారం అందించే వైద్య సేవలపై విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఆరోగ్య మహిళా కేంద్రం ద్వారా ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రానికి వచ్చిన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేసుకుని, వైద్యులు సూచించిన పరీక్షలు ఉచితంగా అందించి మందులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి దివ్యశ్రీ, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వస్త్రపరిశ్రమలో వణుకు..!

- టీపీటీడీసీ చైర్మన్ రాజీనామా
- పెండింగ్‌లో రూ.200 కోట్ల బతుకమ్మ చీరల బిల్లులు.. కార్మికుల యారన్ సబ్సిడీ డబ్బులు
- కొత్తగా మరో రూ.70 కోట్ల బట్ట సేకరణ
- ప్రభుత్వ మార్పుతో పరిశ్రమ వర్గాల్లో సందిగ్ధం

సిరిసిల్ల: ఎన్నికల ఫలితాలతో సిరిసిల్ల వస్త్రపరిశ్రమ వణుకుతోంది. దశాబ్దకాలంగా వస్త్రపరిశ్రమకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం లభించడంతో పరిశ్రమవర్గాలు ఉత్సాహంగా పని చేశాయి. ఇప్పుడు నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఎన్నికల్లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా కె.తారక రామారావు విజయం సాధించారు. రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఓటమి పాలై కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. 15 నెలలుగా తెలంగాణ రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీపీటీడీసీ) చైర్మన్‌గా ఉన్న సిరిసిల్లకు చెందిన గూడూరి ప్రవీణ్ సోమవారం రాజీనామా చేశారు. దీంతో తాజా పరిస్థితులు వస్త్ర పరిశ్రమ వర్గాల్లో వణుకు పుట్టిస్తున్నాయి.

పెండింగ్‌లో బతుకమ్మ బిల్లులు

సిరిసిల్ల పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో వస్త్రపరిశ్రమ స్థిరపడింది. ఇక్కడి మరమగ్గాల(సాంచాల)కు పని కల్పించేందుకు ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తుంది. ఈ ఏడాది కూడా బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వగా.. 1.20 కోట్ల మీటర్ల బట్టను కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి కేవలం 20 శాతం బిల్లులు మంజూరు చేశారు. గతేడాది, అంతకు ముందు సరఫరా చేసిన బతుకమ్మ చీరల బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కాకుండా సర్వశిక్ష అభియాన్(ఎస్‌ఎస్‌ఏ), రంజాన్, క్రిస్మస్, సంక్షేమ శాఖలు, కేసీఆర్ కిట్లకు సంబంధించి వస్త్రాల బిల్లులు టెస్కో వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు రూ.200 కోట్ల బిల్లులు వస్త్రపరిశ్రమకు రావాల్సి ఉంది. మరోవైపు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు అనామతు(అనధికారికం)గా మరో



సాంచాలపై వస్త్రోత్పత్తి

రూ.70 కోట్ల వస్త్రాన్ని సేకరించి హైదరాబాద్ శివారులోని భూదాన్‌పోచమ్మ గోదాములో నిల్వ చేశారు. ఈ బట్టకు ఎలాంటి అధికారిక లెక్కలు లేవు. వీటికి సంబంధించి బిల్లులు ఎలా వస్తాయోనని వస్త్రోత్పత్తిదారులు ఆందోళన చెందుతున్నారు.

కార్మికుల యారన్ సబ్సిడీ..

నేతకార్మికుల కూలి సర్దుబాటులో భాగంగా ప్రభుత్వం యారన్(నూలు) సబ్సిడీ అందిస్తుంది. కార్మికుడు నేసిన బతుకమ్మ చీరల బట్ట ఆధారంగా మీటరుకు రూ.1.25 చొప్పున సబ్సిడీని కార్మికుల ఖాతాల్లో జమ చేస్తుంది. 2021 నాటి యారన్ సబ్సిడీని 5,128 మంది కార్మికులకు రూ.8.77 కోట్లను గత నవంబరులో టెస్కో అధికారులు అందించారు. ఇంకా 2022 నాటి బతుకమ్మ చీరలు నేసిన శ్రమఫలం, 2023 నాటి యారన్ సబ్సిడీ సొమ్ములు రావాల్సి ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారిపోవడంతో యారన్ సబ్సిడీ ఎప్పుడు వస్తుందో అనే ఆందోళన కార్మికుల్లో నెలకొంది.

ఎస్‌ఎస్‌ఐ యూనిట్లకు 'కరెంట్' సబ్సిడీ కష్టాలు

సిరిసిల్లలోని వస్త్రపరిశ్రమకు 2001 నుంచి విద్యుత్‌ను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై అందిస్తుంది. వస్త్రోత్పత్తిదారులు చిన్న తరహా పరిశ్రమలు(ఎస్‌ఎస్‌ఐ)గా మారడంతో కుటీర పరిశ్రమగా ఉన్న వస్త్రోత్పత్తి రంగం వాణిజ్య పరిశ్రమగా మారడంతో సబ్సిడీ తొలగించాలని, పూర్తి స్థాయి విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. సిరిసిల్ల ఎస్‌ఎస్‌ఐ యూనిట్లకు 'సెస్' అధికారులు మొత్తం బిల్లులు చెల్లించాలని నోటీసులు జారీచేశారు. దీనిపై ఎస్‌ఎస్‌ఐ యూనిట్ల యజమానులు కోర్టును ఆశ్రయించగా పెద్దగా ఊరట లభించలేదు. ఈ అంశం ఇంకా పెండింగ్‌లోనే ఉంది.



బతుకమ్మ చీరల బట్ట

మొన్నటి వరకు అన్నింటికీ 'కేటీఆర్' అభయం

గత తొమ్మిదిన్నరేళ్లుగా రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రిగా స్థానిక ఎమ్మెల్యే కె.తారకరామారావు ఉండడంతో వస్త్రవ్యాపారులు మంత్రిని కలుస్తూ.. టెస్కో అధికారులకు చెప్పిస్తూ.. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వచ్చేలా ప్రయత్నం చేసేవారు. కార్మికుల యారన్ సబ్సిడీ నుంచి పింజర్ల పైకం వరకు అన్నింటిపైనా అవగాహన ఉన్న కేటీఆర్ వస్త్రపరిశ్రమకు అభయం ఇచ్చేవారు. కాస్త అటో ఇటో అన్ని బిల్లులు వచ్చేవి. ఎస్‌ఎస్‌ఐ యూనిట్ల విద్యుత్ సబ్సిడీ సమస్యను సైతం కేటీఆర్ చొరవతో పెండింగ్‌లో ఉంచారు. కానీ ఇప్పుడు కేటీఆర్ ఎమ్మెల్యేగా ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నారు. టీపీటీడీసీ చైర్మన్ ప్రవీణ్ రాజీనామా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు సంబంధించి సమస్యలు మరుగున పడే ప్రమాదం ఉంది. మూడేళ్లుగా గ్రహణం పట్టిన పెండింగ్ బిల్లులకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో అని వస్త్రపరిశ్రమ వర్గాలు నిరీక్షిస్తున్నాయి.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలిసిన నాయకులు



శ్రీధర్‌బాబుతో నాయకులు

సిరిసిల్ల: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యేలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కె.కె.మహేందర్‌రెడ్డి, యెల్లె లక్ష్మీనారాయణ, గోలి వెంకటరమణ కలిశారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఉన్నారు.

కోడ్ ముగిసినా.. ముసుగు తొలగలే



తంగళ్లపల్లిలో రాజీవ్ గాంధీ విగ్రహానికి ముసుగు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సోమవారం సాయంత్రానికే ముగిసిందని ఎలక్షన్ కమిషన్ అధికారికంగా ప్రకటించింది. కానీ తంగళ్లపల్లి మండల కేంద్రంలో మాత్రం ఎన్నికల కోడ్ ఇంకా ముగియనట్లే కనిపిస్తోంది. ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలకు సంబంధించిన నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించలేదు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గల రాజీవ్ గాంధీ విగ్రహానికి ముసుగు తొలగించాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు.

రైతన్నకు 'మిచాంగ్' గుబులు

ధాన్యాన్ని కాపాడుకునేందుకు తంటాలు

మిచాంగ్ తుపాన్ రైతులను ఆగం చేస్తోంది. జిల్లావ్యాప్తంగా మంగళవారం ముసురు వాన కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

నిలిచిన కొనుగోళ్లు

కోనరావుపేట/ముస్తాబాద్: మిచాంగ్ తుపానుతో మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు తడిసిపోయాయి. దీంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు రైతులకు సరిపడా వసతులు కల్పించడంలో విఫలమయ్యారు. రైతులు వడ్లపై కప్పుకోవడానికి పరదాలు కూడా సమకూర్చడంలేదు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు నామాపూర్, గూడెం గ్రామాల్లోని కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం అమ్మకాలు చివరి దశలో ఉండగా తూకం వేయని ధాన్యం కుప్పల వద్దకు రైతులు కవర్లతో



సుద్దాలలో తడిసిన ధాన్యం నిల్వలు

పరుగులు పెట్టారు. టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో రైతులే కవర్లు అద్దెకు తీసుకుని ధాన్యంపై కప్పారు.



నర్మాలలో ధాన్యం బుక్కుతున్న అడవి పంది



గంభీరావుపేటలో ధాన్యంకుప్పపై వానరాలు


పగలు కోతులు.. రాత్రి అడవి పందులు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాతలకు అష్టకష్టాలు తప్పడం లేదు. ఇటు ప్రకృతి, అటు వన్యప్రాణుల బెడద తీవ్రమైంది. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటే పొద్దంతా కోతులు, రాత్రి అడవి పందులు ధాన్యాన్ని బుక్కడం, చిందరవందర చేస్తున్నాయి. వన్యప్రాణుల బెడద తీరేదెన్నడో అంటూ రైతులు వాపోతున్నారు.

మున్సిపల్ ఏఈపై కౌన్సిలర్ భర్త తిట్లపురాణం

- పదిరోజుల క్రితం ఘటన.. మంగళవారం కేసు నమోదు

సిరిసిల్లటౌన్: దురహంకారంతో మున్సిపల్ అధికారిపై విర్రవీగిపోయాడు కౌన్సిలర్ భర్త. తన వార్డు పరిధిలో చేపడుతున్న కాల్వ నిర్మాణంలో ఇంజినీరింగ్ ప్రణాళికకు వ్యతిరేకంగా తాను చెప్పినట్లు నిర్మాణం చేపట్టాలని ఆదేశించగా.. కుదరదని చెప్పిన అధికారిపై దాడికి యత్నిస్తూ తిట్లపురాణం అందుకోవడం ఉద్యోగుల మనస్తాపానికి గురికాగా, మంగళవారం సిరిసిల్ల ఠాణాలో కేసు నమోదైంది. బాధితుడి వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం 37వ వార్డులో గత నెల 23న మున్సిపల్ ఏఈ నర్సింహాస్వామి మురుగుకాల్వ నిర్మాణం చేపట్టే పనుల పరిశీలనకు వెళ్లాడు. అక్కడికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్త దిడ్డి రాజు, అతడి అనుచరుడు గాలి రాజు వచ్చారు. తాను చెప్పినట్లు పనులు చేయాలని హుకుం జారీ చేయగా, ప్లానింగ్ ప్రకారమే చేపట్టాల్సి ఉంటుందని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి చెబుతానని అధికారి పేర్కొన్నాడు. ఇందుకు దిడ్డి రాజు, అతడి అనుచరుడు అసభ్య పదజాలంతో పాటు కులం పేరుతో దూషిస్తూ కాల్వలో వేసి తొక్కుతా అంటూ దాడికి యత్నించాడని బాధితుడు పేర్కొన్నాడు. మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు చల్ల శ్రీధర్, పాలాస వెంకటేశ్ సమక్షంలో ఈఘటన జరిగిందన్నారు.



ఠాణాలో మున్సిపల్ ఉద్యోగులు

హైడ్రామా తర్వాత

ఘటన జరిగి 12 రోజులు గడిచింది. ఇన్ని రోజులు ఈవిషయంపై మున్సిపల్ అధికారులు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చి ఉదయం నుంచి చాలా సమయం ఠాణాలోనే గడిపారు. నిందితుడు గతంలో కూడా పలువురు అధికారులపై ఇలాగే ప్రవర్తించినా అధికారులు ఎప్పుడూ చర్యలకు ఉపక్రమించలేదని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం మున్సిపల్ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఠాణాకు తరలివచ్చి ఫిర్యాదు చేయడం స్థానికంగా చర్చకు తెరలేపింది. మరోవైపు మున్సిపల్, బీఆర్‌ఎస్ పెద్దలు ఈవిషయంలో రాజీకి పొద్దంతా ప్రయత్నించినా ఉద్యోగులు మాత్రం వినలేదు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. కాగా ఎన్నికల ఫలితాలు వెలువడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూలిపోయిన రెండ్రోజుల్లోనే మున్సిపల్ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఠాణాకు తరలిరావడం చర్చనీయాంశమైంది.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్‌జయంతి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రీ మెట్రిక్ 9వ తరగతి నుంచి పదో తరగతి వరకు, ఫస్ట్ మెట్రిక్ 11వ తరగతి నుంచి 12వ తరగతి వరకు, ఉన్నత విద్యలో డిగ్రీ ఆపై తరగతుల విద్యార్థులు అర్హులని తెలిపారు.

'హస్త'వాసి బాగుంది!

- ప్రభుత్వ వ్యతిరేకత, పోరాటాలతో 8 సీట్లు కైవసం
- బలంగా పని చేసిన సానుభూతి, 6 పథకాలు
- నిరాశపరిచిన హుజూరాబాద్, జగిత్యాల ఫలితాలు
- ఉత్సాహం నింపిన రాహుల్‌గాంధీ, రేవంత్, భట్టి పర్యటనలు
- నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ విజయావకాశాలకు బీజేపీ గండి
- నిజమైన 'సాక్షి' కథనం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ నేతల హస్తవాసి బాగుంది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల్లో చేతిగుర్తు లీడర్లకు, కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దక్కిన ఈ విజయం కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపింది. అయితే, ఇవన్నీ ఒక్క రోజులో జరిగినవి కావు. పకడ్బందీ ప్రణాళికతో ఈరోజు పటిష్ట స్థితికి చేరుకోగలిగింది.

13 నియోజకవర్గాల్లో మీటింగ్‌లు

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 8 సీట్లు కైవసం చేసుకుంది. ప్రచారంలో ఆ పార్టీ ఇచ్చిన హామీలు, అనుసరించిన వ్యూహాలు, 6 గ్యారంటీ పథకాలను పక్కాగా ప్రజల్లోకి తీసుకెళ్లగలగడం, అగ్రనేతల పర్యటనలు కేడర్‌లో ఆత్మస్థైర్యాన్ని నింపాయి. భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పేరిట ఆదిలాబాద్ నుంచి మధిర వరకు చేపట్టిన పాదయాత్ర ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల మీదుగా సాగింది. దీనికి జాతీయ నాయకులు హాజరవడం కేడర్‌లో ఐక్యతను పెంచింది. తర్వాత రేవంత్‌రెడ్డి వరుస మీటింగ్‌లు, రాహుల్ గాంధీ పర్యటనలు మరింత జోష్ పెంచాయి.

ప్రభుత్వ వ్యతిరేకత, ధరణి సమస్యలు

ఇదే సమయంలో టీఎస్‌పీఎస్సీ కుంభకోణం, 317 జీవో అమలుతో వచ్చిన వ్యతిరేకత, ధరణిలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. వీటిని ఎండగట్టడంలో ఇక్కడి కాంగ్రెస్ నాయకులు సక్సెస్ అయ్యారు. అంతేకాకుండా టీఎస్‌పీఎస్సీ నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొన్నవారు, సూత్రధారులు, పాత్రధారులు సైతం ఉమ్మడి జిల్లాకు చెందినవారు కావడం ఇక్కడ కారు పార్టీ ప్రతిష్ట మసకబారేలా చేసింది. దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాల అమలులో అవినీతి, అనుచరులకే ఇస్తామంటూ నేతల బహిరంగ వ్యాఖ్యలు హస్తం పార్టీకి కలిసివచ్చాయి. ఎన్నికల మేనిఫెస్టో రూపొందించాక.. 6 గ్యారంటీ పథకాలకు విస్తృత ప్రచారం, బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనన్న నినాదాన్ని జనాల్లోకి తీసుకెళ్లడంలో కిందిస్థాయి కేడర్ సఫలీకృతులయ్యారు. వీటికి ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నాయకులపై ప్రజలకు ఉన్న సానుభూతి జత కలిసింది. ఫలితంగా మంచి మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయతీరాలకు చేరారు.

దెబ్బతీసిన బీజేపీ, ఇండిపెండెంట్లు..

వాస్తవానికి ఈసారి ఎన్నికల్లో బీజేపీ బలమైన అభ్యర్థులను రంగంలోకి దించడం పరోక్షంగా కాంగ్రెస్



సాక్షి
ఆరైనా 'హస్తగతం' కావాలి!

ఆగస్టు 26న 'సాక్షి' ప్రచురించిన కథనం

పార్టీకి చేటు చేసింది. దీనికి స్వతంత్రులు సైతం తోడయ్యారు. ఒక్క సిరిసిల్ల మినహా కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్, హుజూరాబాద్‌లో బీజేపీ బలం, చీలిన ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌ను ఓటమిపాలు చేశాయి. బీఆర్‌ఎస్ గెలిచిన 5 స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థులు ఉన్నారు. జగిత్యాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్లలో జువ్వాడి నర్సింగరావు, హుజూరాబాద్‌లో ఒడితెల ప్రణవ్ ఓటమికి కమలం పార్టీ అభ్యర్థులు చీల్చిన ప్రభుత్వ వ్యతిరేక ఓట్లే కారణమని కాంగ్రెస్ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచి, క్లీన్ స్వీప్ చేశారు. ఈ మూడు నియోజకవర్గాల్లో ఎక్కడా బీజేపీ బలమైన అభ్యర్థులను నిలబెట్టలేకపోయిందని, ఇందుకు ఆ పార్టీకి వచ్చిన ఓట్లే నిదర్శనమని అంటున్నారు.

నిజమైన సాక్షి కథనం...

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న ఆది శ్రీనివాస్–వేములవాడ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్–ధర్మపురి, మక్కాన్ సింగ్–రామగుండం, శ్రీధర్ బాబు–మంథని, జీవన్‌రెడ్డి–జగిత్యాల, పొన్నం ప్రభాకర్–హుస్నాబాద్ గెలుస్తారని, ఆ దిశగా పార్టీ ప్రణాళికతో సాగుతోందని ×ఆరైనా హస్తగతం కావాలి₹ అన్న శీర్షికన గత ఆగస్టు 26న ×సాక్షి₹ దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. అదే నిజమైంది. అయితే, హోరాహోరీ పోరులో జగిత్యాల సీటు కాంగ్రెస్ చేజారగా, అదనంగా పెద్దపల్లి, మానకొండూరు, చొప్పదండి స్థానాలు ఆ పార్టీ ఖాతాలో చేరడం గమనార్హం. మాజీ ఎంపీ వివేక్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారన్న విషయాన్నీ ఇదే కథనంలో ప్రస్తావించిన విషయం విదితమే.

పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు వచ్చిన ఓట్లు

రామగుండం : రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్: 92,227
కందుల సంధ్యారాణి (బీజేపీ): 12,966
పెద్దపల్లి : చింతకుంట విజయరమణారావు : 1,18,888
దుగ్యాల ప్రదీప్‌కుమార్ (బీజేపీ) : 6,312
మంథని : దుద్దిళ్ల శ్రీధర్‌బాబు: 1,03,822
చందుపట్ల సునీల్‌రెడ్డి (బీజేపీ): 5,680

బీఆర్‌ఎస్ గెలిచినచోట బీజేపీకి వచ్చిన ఓట్లు

కరీంనగర్: గంగుల కమలాకర్ (బీఆర్‌ఎస్) : 92,179
బండి సంజయ్ (బీజేపీ) : 89,016
హుజూరాబాద్: పాడి కౌశిక్‌రెడ్డి (బీఆర్‌ఎస్) : 80,333
ఈటల రాజేందర్ (బీజేపీ) : 63,460
జగిత్యాల : సంజయ్‌కుమార్ (బీఆర్‌ఎస్) : 70,243
బోగ శ్రావణి(బీజేపీ): 42,138
కోరుట్ల: కల్వకుంట్ల సంజయ్ (బీఆర్‌ఎస్) : 72115
ధర్మపురి అర్వింద్ (బీజేపీ) : 61,810
సిరిసిల్ల: కేటీఆర్ (బీఆర్‌ఎస్) : 88,761
రాణీ రుద్రమదేవి (బీజేపీ) : 18,328

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థికసాయం



సిరిసిల్లక్రైం: హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన అలీ బిన్ సయ్యద్ కుటుంబ సభ్యులకు తోటి ఉద్యోగులు బాసటగా నిలిచారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా నగదు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, హోంగార్డ్ కుటుంబానికి తోటి ఉద్యోగులు రూ.1.20 లక్షలు అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ధి సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆర్ఐలు తదితరులు ఉన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠాపన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం అనంతారంలో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బొడ్రాయితోపాటు దేవతామూర్తుల విగ్రహాలకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేలను కలిసిన ఎంపీపీ



ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, పొన్నంతో వెంకటరమణ రెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకటరమణరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి కృషిచేయాలని ఆయన కోరారు.

మహిళల భద్రతకు షీ టీం

సిరిసిల్ల క్రైం: జిల్లాలో మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ ప్రాధాన్యం తీసుకుంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... గతనెలలో షీటీం ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగు కేసులు, 2 పెట్టీ కేసులు నమోదు చేశామన్నారు. షీటీం అందించే రక్షణ చర్యలపై 86 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా వేధింపులకు గురైతే డయల్ 100, షీటీం నంబర్ 87126 56425కు సమాచారం అందించాలన్నారు. పనిచేసే ప్రాంతంలో మహిళలకు ఇబ్బందులుంటే తెలపాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు రక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్రగాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడికి తీవ్రగాయాల య్యాయి. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన మంగలి అక్షయ్ (17) చీకోడు నుంచి సోమవారం నామాపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అక్షయ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. అక్షయ్ మండలంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చికిత్స కోసం సిరిసిల్ల ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉంది. తల్లిదండ్రులు శమంత- దేవయ్య అక్షయ్ ప్రమాదంపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాపూర్(మానకొండూర్): భార్య కాపురానికి రావడం లేదని మన్నెంపల్లికి చెందిన నాంపల్లి రాజు(29) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. రాజు భార్య కవిత కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు తిరిగి రావాలని కోరినా రాకపోవడంతో అతను మనస్తాపం చెందాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి జగన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై మరొకరు..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌కు చెందిన భూతం రాయలింగు(48) ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. రాయలింగు కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత ఆరు నెలలుగా మద్యానికి బానిసై, పనికి వెళ్లకుండా ఖాళీగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో అతిగా మద్యం సేవించి, ఆ మత్తులో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం అతని భార్య లక్ష్మి లేచి చూడగా మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు.

ఎన్నికల సేన 2.0

- ముందస్తు కార్యాచరణతో యంత్రాంగం సఫలం
- చెదురుమదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతం
- సకల సౌకర్యాలు.. ప్రత్యేక కేంద్రాల్లో పెరిగిన పోలింగ్‌శాతం

జిల్లాల వారీగా పోలింగ్ శాతమిలా

ఉమ్మడి జిల్లా పోలింగ్‌శాతం	: 76.00
కరీంనగర్	: 75.64
పెద్దపల్లి	: 75.62
జగిత్యాల	: 76.12
రాజన్న సిరిసిల్ల	: 75.92



కరీంనగర్ అర్బన్: తెలంగాణ శాసన సమరంలో అభ్యర్థుల జయాపజయాలు పక్కనబెడితే ఉద్యోగుల పాత్ర అమోఘం. రాత్రనక, పగలనక శ్రమించిన తీరు అభినందనీయం. ప్రకటన వెలువడిన దరిమిలా జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు, ముందస్తు కార్యాచరణ ఎన్నికల మెరుగైన నిర్వహణకు దోహదపడ్డాయి. అటెండర్ నుంచి కలెక్టర్ వరకు ఎన్నికల్లో భాగస్వాములు కాగా పక్కా ప్రణాళికతో బేష్ అనిపించారు. ఉమ్మడి జిల్లాలో చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా నిర్వహించారు. పలు చోట్ల ఓట్లు గల్లంతవడం.. పోల్ చీటీలు రాకపోవడం కొంత ఆందోళన కలిగించింది. వెరసి 2023 ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.

కలెక్టర్ల పాత్ర అభినందనీయం

ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని నాలుగు జిల్లాల ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కలెక్టర్ల పాత్ర అభినందనీయం. కలెక్టర్లు పమేలా సత్పతి(కరీంనగర్), అనురాగ్ జయంతి(రాజన్నసిరిసిల్ల), ముజమ్మిలాఖాన్(పెద్దపల్లి), షేక్ యాస్మిన్ బాషా(జగిత్యాల)లు ఎన్నికల నిర్వహణలో సఫలమయ్యారు. ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలను కిందిస్థాయి సిబ్బంది వరకు చేరవేరవేయడంలో పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో వీరికి అయా జిల్లాల సీపీలు, ఎస్పీలు సహకారం అందించారు. ఫలితంగా ఎన్నికలలో కీలకఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా ముగియగా ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించారు.

నిర్వహణలో ప్రధాన శాఖలు ఇవే..

ఎన్నికల విజయవంతం అయ్యాయంటే రెవెన్యూ పాత్ర కీలకం కాగా దీనికితోడు సుమారు 20శాఖలకు పైగా ఉద్యోగులు తమవంతు పాత్ర పోషించారు. ఓటరు నమోదు మొదలుకుని పోలింగ్ పూర్తయి.. ఓట్ల లెక్కింపు వరకు కీలక భూమిక పోషించారు. యువత ఓటెత్తగా పట్టణాల్లోనూ పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌శాతం పెరిగింది. రెవెన్యూ, విద్యాశాఖ, కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, ఎక్సైజ్, మహిళా సంక్షేమం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, ఆర్టీసీ, సర్వే లాండ్ రికార్డ్స్, సహకార ఆడిట్ విభాగం, నీటి పారుదల, రోడ్లు, భవనాలు, ట్రెజరీ, బీఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్, వైద్య ఆరోగ్యశాఖ, యువజన సంక్షేమ, ఇంటర్మీడియట్, తదితర శాఖలు, ఆయా కళాశాలల ఉద్యోగులు ఎన్నికల సేనలో ఉన్నారు.

గురువులు కీలకులే

ఎన్నికల ప్రక్రియ అంతా ఒక ఎత్తయితే పోలింగ్ మరో ఎత్తు. ఆ పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయం. గత నెల 29, 30 తేదీల్లో వారు నిద్రలేని రాత్రులు గడిపి ఎన్నికల సమరాన్ని గట్టెక్కించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13,185 మంది ఉపాధ్యాయులు ఈ క్రతువులో పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యం

పాలిటెక్నిక్ విద్యార్థులు, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, మండల, జిల్లా కార్యాలయాల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లకు పోలింగ్ చిత్రీకరణ పనులు అప్పజెప్పారు. వారూ కేంద్రాలకు వెళ్లి ఉదయం నుంచి పోలింగ్ ముగిసే వరకు వీడియో చిత్రీకరణ చేసి ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారం అందించడంలో కీలక భూమిక పోషించారు. ఈ ప్రక్రియలో ఉమ్మడిజిల్లావ్యాప్తంగా 2,500 మంది యువత సాంకేతిక జోడింపులో పాత్ర పోషించారు. బీఎల్వోలు, అశాకార్యకర్తలు, ఎఎన్ఎంలు ఓటరు జాబితా రూపకల్పనలో ఓటర్లకు పోల్ చీటీలు పంచి వారిని పోలింగ్ కేంద్రానికి చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు వేల సిబ్బంది రెండునెలలకు పైగా తీరిక లేకుండా క్షేత్రస్థాయిలో పని చేశారు.

నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్‌శాతం

కరీంనగర్:	62.93
మానకొండూరు:	81.33
హుజూరాబాద్:	80.62
చొప్పదండి:	77.68
కోరుట్ల:	75.62
జగిత్యాల:	74.12
ధర్మపురి:	79.01
సిరిసిల్ల:	73.42
వేములవాడ:	78.43
మంథని:	79.14
రామగుండం:	68.74
పెద్దపల్లి:	81.40

ప్రత్యేక సేవల్లో సంక్షేమ, డీఆర్డీఏ

ఓటుహక్కు ఉన్న దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్ సౌకర్యం కల్పించగా జిల్లా సంక్షేమ శాఖ, డీఆర్డీఏ, పరిశ్రమలశాఖ విశేష కృషి చేసింది. ఇంటింటికీ వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునేలా శ్రమించారు. నడిచేవారు, ఆరోగ్యంగా ఉన్న వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం, తిరిగి వారిని ఇంటి వద్దకు చేర్చడంలో వలంటీర్ల కృషి అభినందనీయం. అంగన్‌వాడీలు గర్భిణులు, బాలింతలతో ఓటు వేయించడంలో చొరవ చూపారు.

పటిష్ట భద్రత

ఒకప్పుడు మావోయిస్టు, జనశక్తి ప్రభావిత ప్రాంతంగా ముద్రపడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పుడు ఆ ప్రభావం అంతగా లేకపోయినా పోలింగ్ రోజున ఎలాంటి సమస్య తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. అభిషేక్ మహంతి(కరీంనగర్ సీపీ) అఖిల్ మహజన్ (రాజన్నసిరిసిల్ల ఎస్పీ) రెమో రాజేశ్వరి(పెద్దపల్లి సీపీ), సన్‌ప్రీత్‌సింగ్(జగిత్యాల ఎస్పీ)ల సమక్షంలో జిల్లా పోలీసులతో పాటు బలగాలు, పారామిలటరీ సైనికులు బందోబస్తు నిర్వహించారు.

జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక

సిరిసిల్లఎడ్యుకేషన్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో జిల్లా విద్యార్థి వినీల ప్రతిభచాటి జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి దేవయ్య మంగళవారం తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రదర్శనల్లో విద్యార్థులు పాటీపడ్డారు. ఇందులో నాలుగు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపికచేశారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రదర్శనల్లో రాష్ట్రవ్యాప్తంగా 132 మంది విద్యార్థులు ప్రదర్శనలు ఇవ్వగా జాతీయ స్థాయికి 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జెడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి వినీల జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. విద్యార్థినిని జిల్లా విద్యాధికారి రమేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న వినీల

ముసురుకున్న వాన





మిచాంగ్ తుపాను ముసురుకుంది. జిల్లాలో మంగళవారం పొద్దస్తమానం వర్షం కురియడంతో విద్యార్థులు, దినసరి కూలీలు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంలో కష్టజీవులు, ఆఫీసులకు భార్యలను బైక్‌పై తీసుకెళ్లే భర్తలు, ఇతరత్రా పనులకు వెళ్లే ప్రజలు, విద్యార్థులను 'సాక్షి' క్లిక్ మనిపించింది. - సాక్షి, ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

అదృశ్యమై.. వ్యవసాయ బావిలో శవమై

- లస్మన్నపల్లిలో ఘటన

సైదాపూర్: అదృశ్యమైన ఓ వ్యక్తి వ్యవసాయ బావిలో శవమై తేలాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లికి చెందిన కొట్టె శ్రీకాంత్‌రెడ్డి(34) భార్య ప్రణీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె పిల్లలతో కలిసి తన పట్టింటికి వెళ్లింది. శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాలేదు. అయితే, అతను కనిపించడం లేదని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వెన్నంపల్లికి చెందిన రైతు ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తన వ్యవసాయ బావిలో నీళ్ల ఏ మేరకు ఉన్నాయోనని తొంగి చూశాడు. అతనికి అందులో శ్రీకాంత్‌రెడ్డి మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని బయటికి తీయించారు. బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు మృతుడి భార్య ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన

సిరిసిల్లటౌన్: ప్రతివారం 'ఆరోగ్య మహిళా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ... జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళా' శిబిరానికి మంచి స్పందన వస్తోందన్నారు. సిరిసిల్లలోని బీఎస్‌నగర్, వేములవాడ పీహెచ్‌సీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళా శిబిరాల్లో పలు పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో 17 మందిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. ఆయా ఆరోగ్యకేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని కనగర్తి గ్రామ సర్పంచ్ అత్త హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. జమ్మికుంట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ జీవన్‌రెడ్డి సంబంధిత వివరాలు వెల్లడించారు. కనగర్తికి చెందిన రామంచ కుమార్‌కు దామెర మండలం లాదేల్ల గ్రామానికి చెందిన శ్రీలతతో కొన్ని నెలల క్రితం వివాహం జరిగింది. అయితే, దంపతుల మధ్య విభేదాలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కుమార్ పలుమార్లు అత్తగారింటికి వెళ్లి, తన భార్యను పంపాలని కోరగా వారు నిరాకరించారు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. సమస్య పరిష్కరించాలని సర్పంచ్ రజిత భర్త వాసుదేవరెడ్డికి విన్నవించాడు. ఇది మీ ఇంటి సమస్య కాబట్టి తాను జోక్యం చేసుకోనని ఆయన తెలిపాడు. దీంతో కుమార్ వాసుదేవరెడ్డిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 4న సాయంత్రం 5.30 గంటలకు పెట్రోల్, కారంపొడి, కత్తి బ్యాగ్‌లో పట్టుకొని, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లాడు. కార్యాలయ తలుపులపై పెట్రోల్ చల్లి, కాల్చే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్కడి నుంచి నేరుగా సర్పంచ్ ఇంటికి వెళ్లాడు. సర్పంచ్ అత్త లచ్చవ్వ తన ఇంటి ముందు ఒంటరిగా కూర్చొని ఉంది. ఇదే అదునుగా భావించి, ఆమెను కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో మృతిచెందింది. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఇల్లందకుంట ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ పాషా తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

వేములవాడ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరును ఏఐసీసీ ప్రకటించడంతో వేములవాడలో యూత్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం తెలంగాణచౌక్‌లో సంబరాలు జరుపుకున్నారు. పటాకులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎర్ర శ్రావణ్, ఎడ్ల శ్రీనివాస్, పల్లికొండ అమర్, వంగల దినేశ్, సాయిప్రసాద్, కే. మహేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ చౌక్‌లో సంబరాల్లో పాల్గొన్న నాయకులు

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



గాయపడిన ప్రయాణికులు



బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్ మల్లయ్య

మానకొండూర్: లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేటకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం వేములవాడ నుంచి సూర్యాపేట వెళ్తోంది. మార్గమధ్యలో మానకొండూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న జి.కమలమ్మ, భిక్షం, రమణ, బండపెల్లి పద్మతో సహా 15 మంది గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ మల్లయ్య బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో అతికష్టమ్మీద బయటకు తీశారు. అనంతరం క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మోదం.. ఖేదం

- సిరిసిల్ల నేతలకు మిశ్రమ ఫలితం
- రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం
- సిరిసిల్లలో బీఆర్ఎస్ జయకేతనం



ముస్తాబాద్(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గ పార్టీల నేతలకు ఈ ఎన్నికలు మిశ్రమ ఫలితాలు అందించాయి. నెల రోజులుగా ప్రజల్లోకి వెళ్లి కష్టపడిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల ఫలితాలను ఎలా రీసీవ్ చేసుకోవాలో తెలియని అయోమయ పరిస్థితి ఎదురైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సంబరాలు చేసుకోవాలా.. వద్దా అనే ఆలోచనలో పడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 64 ఎమ్మెల్యే సీట్లు గెలుచుకొని అధికారం చేపట్టగా.. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి కేటీఆర్ భారీ మెజార్టీతో గెలిచారు.

సంబరాలు చేద్దామంటే..

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాలు చేసి సబ్బండ వర్గాలను కదిలించిన బీఆర్ఎస్ అధికారం సాధించి పదేళ్లు పాలించింది. మంత్రి కేటీఆర్ సిరిసిల్ల అభివృద్ధిలో తన మార్కు చూపారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పదేళ్లుగా పోరాటం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో వచ్చిన ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. రాష్ట్రం మొత్తం సిరిసిల్ల వైపు చూడగా కేటీఆర్ 89,244 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి 59,557 ఓట్లు సాధించారు. 29,887 మెజార్టీతో కేటీఆర్ విజయం సాధించారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ నిజం చేస్తూ కాంగ్రెస్ 64 సీట్లు సాధించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులందరూ విజయోత్సవాల్లో మునిగిపోయారు. సిరిసిల్ల కాంగ్రెస్ నేతలు మాత్రం మహేందర్‌రెడ్డి ఓటమి పాలయ్యారన్న ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో సంబరాలకు దూరంగా ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారం కోల్పోగా తమ నేత కేటీఆర్ విజయం సాధించాడనే సంతృప్తిని ఆస్వాదించలేకపోయారు. ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ నాయకులు మిశ్రమ ఫలితాలను అనుభవించారు. ఎలా స్పందించాలో తెలియని పరిస్థితిని ఇరు పార్టీల్లోని కొంత మంది నాయకులు ఎదుర్కొన్నారని భావించవచ్చు.

బీజేపీది అదే పరిస్థితి..

సిరిసిల్ల అసెంబ్లీ నుంచి బీజేపీ తరఫున అనుహ్యంగా రాణి రుద్రమదేవి బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో మల్లుగారి నర్సాగౌడ్ 3 వేల వరకు ఓట్లు సాధించగా ఈసారి ఎన్నికల్లో రుద్రమదేవి 18,328 ఓట్లు సాధించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రుద్రమదేవి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి మనసును చూరగొని మంచి ఓట్లను సాధించారు. అయితే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో బీజేపీ విజయం సాధించింది. ఆ విజయోత్సవాన్ని కూడా బీజేపీ నాయకులు ఇక్కడ పొందలేకపోయారు. బీజేపీ మూడు రాష్ట్రాల్లో అధికారంలోకి రాగా, సిరిసిల్లలో చాలామంది బీజేపీ నాయకులు సంబరాలకు దూరంగా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. నిర్మల్ జిల్లాలోని వేణునగర్ గ్రామానికి చెందిన టేకం హన్మంతు, ఆత్రం నాగరావు, కొత్తపల్లి చందు సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై పనినిమిత్తం మెట్‌పల్లికి వచ్చారు. తిరిగి రాత్రి సమయంలో స్వగ్రామానికి వెళ్తుండగా రైల్వేవంతెన దాటిన తర్వాత క్రాసింగ్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హన్మంతును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలి పారు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మే ర కు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

సిరిసిల్లక్రైం: వృద్ధురాలు మెడలోని పుస్తెల తాడుతోపాటు ఇంట్లోని నగదు ఎత్తుకెళ్లిన వ్యక్తికి మూడేళ్ల జైలుతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ మంగళవారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని చిన్న లింగాపూర్‌కు చెందిన ఏనుగు కమలమ్మ జనవరి 23న నేరెళ్లలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లింది. తిరిగి గ్రామానికి వెళ్లేందుకు దవాఖాన ముందు ఒంటరిగా నిల్చొని ఉంది. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఇంటివద్ద దింపుతానని నమ్మబలికాడు. వృద్ధురాలి ఇంటికి చేరుకోగానే తనకు పింఛన్ పెంచుతానని, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా ఇవ్వాలని కోరాడు. గదిలోకి వెళ్తుండగా ఆమె మెడలోంచి రెండు తులాల పుస్తెలతాడు, ఇంట్లోని రూ.10వేలు ఎత్తుకెళ్లాడు. దీనిపై తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అల్లెపు కృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఉపేందర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడగా న్యాయమూర్తి మూడేళ్ల జైలుతోపాటు రూ.500నగదు జరిమానా విధించారు.

'పారమిత'లో స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం



స్కౌట్స్ విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: మంకమ్మతోటలోని పారమిత పాఠశాలలో మంగళవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవాన్ని జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ పతాకావిష్కరణ చేసి, ప్రారంభించారు. విద్యార్థులు చేసిన కవాతు అందరినీ ఆకర్షించింది. పాఠశాల డైరెక్టర్లు వినోదరావు, హనుమంతరావు విద్యార్థులకు స్కార్ఫ్, బ్యాడ్జీలను అందజేశారు. పిల్లలు చేసిన పలు విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల అధినేత ప్రసాద్‌రావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, కవిత, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి కంకణాల రాంరెడ్డి, గైడ్స్ కెప్టెన్ రజిత, స్కౌట్స్ మాస్టర్లు రాజశేఖర్, టీచర్లు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టి.. ఇంట్లోకి దూసుకెళ్లి

- వెల్లుల్లలో వ్యాన్ బీభత్సం
- తప్పిన ప్రమాదం
- భారీ శబ్దానికి ఉలిక్కిపడ్డ స్థానికులు



ఇంటిని ఢీకొట్టిన వ్యాన్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో డీసీ ఎం వ్యాన్ బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే... సోమవారం రాత్రి కేసీఆర్ తండా నుంచి ధాన్యం లోడుతో వెళ్తున్న వాహనం గ్రామ శివారులోని క్రాసింగ్ వద్ద చెట్టును ఢీకొట్టి ఓ ఇంట్లోకి దూసుకెళ్లగా ఒకవైపు గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. భారీ శబ్దానికి స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కోర్టు ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన మేకల పోశం అలియాస్ గ్యాస్ పోశం ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. పోశంకు రాజీవ్‌నగర్‌కే చెందిన మహేశ్‌తో పాత గొడవలున్నాయి. ఈ నెల 3న ఇద్దరూ గొడవ పడ్డారు. మహేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పోశం మంగళవారం కోర్టు ఆవరణలోకి వచ్చి, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా అక్కడే విధుల్లో ఉన్న ఎన్టీపీసీ ఠాణా కానిస్టేబుల్ పురుషోత్తం, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ అభి, కోర్టు హోంగార్డు నాగేశ్వర్‌రావులు అడ్డుకున్నారు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించి, బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.